సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.30,290

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30,290, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.16

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

32.6°/16.4°

జిల్లాలో చలి వాతావరణం కొనసాగుతోంది. శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

భోజనం బాగుంటుందా..?

- హాస్టల్ విద్యార్థులను ఆరా తీసిన మంత్రి సవిత



బుక్కపట్నం ఎంజేపీ గురుకుల పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి సవిత

పుట్టపర్తి: ''భోజనం బాగుంటుందా....మెనూ మేరకు అందిస్తున్నారా.. హాస్టళ్లలో వసతులు ఎలా ఉన్నాయి..ఏమైనా ఇబ్బందులున్నాయా'' అని బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి సవిత విద్యార్థులను ఆరా తీశారు. శనివారం ఆమె బుక్కపట్నంలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల, బీసీ బాలికల కళాశాల హాస్టళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, విద్యార్థినులకు దోమల బెడద లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక బీసీ బాలికల కళాశాల హాస్టల్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. మంత్రి వెంట ప్రిన్సిపాల్ రమాదేవి, హాస్టల్ వార్డెన్ లలిత, పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

బాధితులను ఆదుకోవాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్



పెనుకొండ రూరల్: మడకశిర మండలం బుల్లసముద్రం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన తనను కలచి వేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం తెల్లవారుజామున బుల్లసముద్రం సమీపంలో ఆగి ఉన్న లారీని టెంపో ట్రావెల్స్ వాహనం ఢీ కొన్న ప్రమాదంలో నలుగురు మృతి చెందడం, 11 మంది గాయపడటం విచారకరమన్నారు. మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని, క్షతగాత్రుల వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని వైఎస్సార్ సీపీ తరుపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు.

ఏజెన్సీల ద్వారా ఇసుక లోడింగ్‌కు అనుమతి

ధర్మవరం అర్బన్: జిల్లాలోని రెండు ఇసుక రీచ్‌లలో ఏజెన్సీల ద్వారా ఇసుక లోడింగ్‌కు ప్రభుత్వం అనుమతులిచ్చింది. తాడిమర్రి మండలం సీసీ రేవు ఇసుక డిపో వద్ద విరంచి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ముదిగుబ్బ మండలం పీసీ రేవు డిపో వద్ద కేఎల్ఎన్ ఎంటర్ ప్రైజెస్‌ను ఏజెన్సీలుగా నియమించినట్లు ఆర్డీఓ మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక కావాల్సిన వారు రీచ్ దగ్గరికి వాహనంతోపాటు వెళ్లి టన్నుకు రూ.260 చొప్పున చెల్లిస్తే ఏజెన్సీ నిర్వాహకులు ఇసుక లోడ్ చేసి ఇస్తారన్నారు. నదీ ప్రవాహానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల వారు మాత్రమే ఇసుకను ఉచితంగా తీసుకుని వెళ్లటానికి అవకాశముందన్నారు.



వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా బుక్కపట్నంలో కేక్ కట్ చేసి ఆనందం పంచుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు

జగమంత సంబరం

జననేత, మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. ఊరూవాడా ఏకమై సంబరం చేసుకుంది. నాయకుడా జీవించు వందేళ్లు.. వర్ధిల్లు వెయ్యేళ్లంటూ అభిమానులు సంక్షేమ సారథిని మనసారా ఆశీర్వదించారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పలుచోట్ల అన్నదానం, రక్తదానం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అభిమానులు ఆలయాల్లో పూజలు చేశారు. పేదలకు మంచి చేసిన జగన్‌కు అంతా మంచే జరగాలని దేవుళ్లను వేడుకున్నారు.

- ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు
- ఊరూరా పండుగ వాతావరణం
- కేక్ కట్ చేసి పంచిపెట్టిన అభిమానులు
- పలు చోట్ల వైద్య, రక్తదాన శిబిరాలు

సాక్షి, పుట్టపర్తి

గడిచిన ఐదేళ్లలో ఓవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని శనివారం జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలను నిర్వహించారు. తమ అభిమాన నేత ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రక్తదాన శిబిరాలు, అనాథ ఆశ్రమాల్లో దుస్తుల పంపిణీ, ఆస్పత్రుల్లో రోగులకు పాలు, బ్రెడ్ల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు చేపట్టారు. మడకశిర, హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు పండుగలా జరిగాయి. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా తరలివచ్చారు.

పుట్టపర్తిలో మిన్నంటిన జగన్ నినాదం..

పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సీనియర్ నేత డీఎస్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. 'జయహో జగన్' నినాదాలతో పార్టీ కార్యాలయం మార్మోగింది. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ జన్మదిన వేడుకలు జరిగాయి.



ధర్మవరం పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్ జగన్ జన్మదినాన్ని జరుపుకుంటున్న కేతిరెడ్డి కృష్ణారెడ్డి

కదిరిలో రక్తదాన శిబిరం..

కదిరిలోని వేమారెడ్డి సర్కిల్‌లో వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు పూల శ్రీనివాసరెడ్డి, వజ్రభాస్కర్‌రెడ్డి, అత్తార్ చాంద్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరంలో సంబరాలు..

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నివాసంలో ఆయన సోదరుడు కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అదే విధంగా గొట్లూరులోని ఆస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనాథాశ్రమాల్లో దుస్తులు వితరణ చేశారు.

పెనుకొండలో ఘనంగా..

పెనుకొండలోని మడకశిర సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాల వేశారు. అనంతరం జగన్ చిత్రపటం ముందు కేక్ కట్ చేశారు. జయహో జగన్ అంటూ నినాదాలు చేశారు. అదేవిధంగా మాజీ మంత్రి శంకరనారాయణ తన ఇంటి వద్ద కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

'పురం..' సేవా కార్యక్రమాలు ఘనం..

హిందూపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం పేదలకు దుస్తులు, రోగులకు మందులు పంపిణీ చేశారు. ఆగ్రోస్ మాజీ చైర్మన్ బి.నవీన్‌నిశ్చల్ టీచర్స్ కాలనీలో కేక్ కట్ చేసి సోషల్ మీడియా కార్యకర్తలకు దుస్తులు అందజేశారు.

మడకశిరలో పాలు, బ్రెడ్లు పంపిణీ..

నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో మడకశిరలో జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం అక్కడే కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాప్తాడు నియోజకవర్గంలో...

రాప్తాడు నియోజకవర్గం రాప్తాడు, చెన్నేకొత్తపల్లి మండల కేంద్రాల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. రాప్తాడులో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.



రాప్తాడులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



హిందూపురం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న టీఎన్ దీపిక తదితరులు



హిందూపురంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సేవలు పొందుతున్న దృశ్యం



కదిరి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నేతలు



వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మడకశిరలో కేక్‌కట్ చేస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప



పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి పెనుకొండలో కేక్ కట్ చేస్తున్న పొగాకు రామచంద్ర

దారికాచిన మృత్యువు

వెంకన్న దర్శనం చేసుకుని తిరిగివస్తున్న వారిని మృత్యువు కాటేసింది. రెప్పపాటులో నలుగురిని బలితీసుకుంది. మరో 11 మందికి చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. మరో 45 నిమిషాల్లో ఇళ్లు చేరతారనుకున్న వారు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో బాధిత కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. మృతుల్లో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు ఉండటంతో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

- మడకశిర మండలం బుళ్లసముద్రం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆగి ఉన్న లారీని ఢీ కొన్న టెంపో ట్రావెలర్
- నలుగురు మృత్యువాత.. 11 మందికి తీవ్ర గాయాలు
- మృతుల్లో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు
- తిరుమల వెంకన్నను దర్శించుకుని వస్తుండగా ఘటన







ప్రమాదంలో దెబ్బతిన్న టెంపో ట్రావెలర్ వాహనం, తల్లి ప్రేమకుమారి, కుమారుడు అథర్వ, రత్నమ్మ మృతదేహాలు, డ్రైవర్ మనోజ్ మృతదేహం

మడకశిర / మడకశిర రూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం సమీపంలో 544ఈ– జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆగి ఉన్న లారీని టెంపో ట్రావెలర్ వెనుక నుంచి ఢీ కొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

తిరుమల వెళ్లి తిరిగి వస్తుండగా...

గుడిబండ మండలం కేఎన్ పల్లి గ్రామానికి చెందిన శివరాజు, ప్రేమకుమారి(30) దంపతులకు అథర్వ (2), మరో కూతురు సంతానం. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న శివరాజు తన కుమారుడి పుట్టువెంట్రుకలు తీయించేందుకు కుటుంబీకులు, బంధువులతో కలిసి మొత్తం 23 మంది గురువారం సాయంత్రం ఓ టెంపో ట్రావెలర్, మరో రెండు కార్లలో తిరుమల వెళ్లారు. శుక్రవారం తిరుమలలో అథర్వ నామకరణం, తలనీలాల కార్యక్రమం ముగించుకుని స్వామి దర్శనం చేసుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో స్వగ్రామం కేఎన్ పల్లికి తిరుగు పయనమయ్యారు. శివరాజు, కుమార్తె కారులో బయలుదేరగా.. భార్య ప్రేమకుమారి, కుమారుడు అథర్వ బంధువులతో పాటు టెంపో వాహనంలో పయనమయ్యారు. ఈ వాహనం శనివారం తెల్లవారుజామున మడకశిర మండలం బుళ్లసముద్రం గ్రామ సమీపంలోకి రాగానే 544ఈ– జాతీయ రహదారిపై ముందు నిలిచి ఉన్న లారీని వేగంగా ఢీ కొంది. ఈ ఘటనలో ప్రేమకుమారి, అథర్వతో పాటు అమరాపురానికి చెందిన శివరాజు పెద్దమ్మ రత్నమ్మ(65) పాటు పావగడ తాలూకా కొండపురం గ్రామానికి చెందిన డ్రైవర్ మనోజ్(32) మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను 108, మడకశిర ఫోర్ వీలర్ అసోసియేషన్ వాహనాల్లో మడకశిర ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయించారు. ఈ ఘటనపై మడకశిర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నామకరణమే చివరి సంబరం..

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా... అందులో శివరాజు భార్య ప్రేమకుమారి, కుమారుడు అథర్వతోపాటు శివరాజు పెద్దమ్మ రత్నమ్మ ఉండటంతో ఆ ఇంట విషాదం నెలకొంది. కుమారుడు అథర్వకు నామకరణం చేసి గంటలు గడవక ముందే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో శివరాజు దుఃఖసాగరంలో మునిగిపోయారు. కారులో వెళ్దామని తాను పిలిచినా బంధువులతో పాటూ వస్తామంటూ టెంపోలో ఎక్కారని, అవే తన భార్య చివరిమాటలవుతాయని ఊహించలేకపోయానని అతను కన్నీరుమున్నీరయ్యారు. ఇక మడకశిర ప్రభుత్వ ఆస్పత్రి వద్ద చిన్నారి అథర్వ మృతదేహం చూసిన వారంతా 'అయ్యో ఎంత పని చేశావు దేవుడా అంటూ' కన్నీరుమున్నీరయ్యారు.

ఆస్పత్రి వద్ద మిన్నంటిన రోదనలు..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన అమరాపురం మండలం శివరానికి చెందిన నాగమణి, గుడిబండ మండలం కేఎన్‌పల్లికి చెందిన గీతమ్మ, శ్రీదేవి, టీచర్ సుజాతమ్మ, కమలమ్మ, గంగమ్మ, కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా హరిబ్బికి చెందిన శ్వేత, పావగడ తాలుకాలోని హర్తికేరేకు చెందిన గిరిజమ్మ, ఉమేష్, అమ్మాజమ్మ, చిత్రదుర్గ జిల్లాకు చెందిన రవీంద్రలను మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా, కుటుంబీకులు, బంధువులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. తీవ్ర గాయాలతో ఆర్తనాదాలు చేస్తున్న తమవారిని చూసి తల్లడిల్లిపోయారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం 10 మందిని మెరుగైన వైద్యం కోసం తుమకూరుకు తరలించారు. ఇందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. విషయం తెలిసిన వెంటనే ఎస్పీ రత్న, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మడకశిర ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు.

డ్రైవర్ వద్దన్నా..

తనకు నిద్ర వస్తోందని, కొద్దిసేపు పడుకుని వెళ్దామని డ్రైవర్ మనోజ్ చెప్పినా వాహనంలోని వారు వినలేదని తెలిసింది. వారి ఒత్తిడితో డ్రైవర్ గత్యంతరం లేని పరిస్థితిలో బయలు దేరినట్లు తెలిసింది. డ్రైవర్ మాట విని ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని అంటున్నారు.



రోదిస్తున్న డ్రైవర్ మనోజ్ భార్య వినుత

నేనె ట్లా బతికేది ..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ మనోజ్ ఆరేళ్ల క్రితం తమిళనాడు రాష్ట్రానికి చెందిన వినుతను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రమాదంలో అతను మృతి చెందగా..నేనెట్లా బతికేది దేవుడా అంటూ భార్య వినుత బిగ్గరగా రోదించారు.

విషాదఛాయలు

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో కేఎన్ పల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలకు జెడ్పీటీసీ అనంతరాజు, వైఎస్సార్ మండల కన్వీనర్లు యంజారేగౌడు, నరసింహారెడ్డి నివాళులర్పించారు.





క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.21 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ప్రసిద్ధ భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను శనివారం ఆయా ఆలయాల్లో లెక్కించారు. హుండీల ద్వారా రూ.2101652 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. ఇందులో ఆంజనేయస్వామి ఆలయంలో రూ.8,11,384, లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రూ.12,90,268 లక్షల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. ఈ లెక్కింపును అనంతపురం గ్రేడ్–1 అధికారి అక్కిరెడ్డి, ఈఓ నరసింహారాజు, రథోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

తపోవనం జట్టు విజయం



రాప్తాడు, తపోవనం జట్లతో ఆర్డీటీ సిబ్బంది

బత్తలపల్లి: రూరల్ క్రికెట్ సూపర్ లీగ్‌లో రాప్తాడు జట్టుపై తపోవనం జట్టు వంద పరుగుల తేడాతో విజయం సాధించింది. బత్తలపల్లి ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో శనివారం అండర్–15 బాలుర విభాగం క్రికెట్ పోటీల్లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తపోవనం జట్టు 40 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసింది. బ్యాటర్లు తన్మయికార్తీక్‌రెడ్డి 60, అభినవ్‌సాత్విక్ 51 పరుగులతో రాణించారు. అనంతరం 209 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన రాప్తాడు జట్టు తపోవనం బౌలర్ కుశాల్ రాయల్ దెబ్బకు విలవిలలాడింది. 40 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 108 పరుగులు మాత్రమే చేయగలిగింది. రాప్తాడు జట్టులో ఫణి 41 పరుగులు చేశాడు. వంద పరుగుల తేడాతో తపోవనం జట్టు గెలుపొందింది.

పట్టుకోండి చూద్దాం



ఇక్కడ కనిపిస్తున్నది ధర్మవరం – పుట్టపర్తి ప్రధాన రహదారి వద్ద ఉన్న వాణిజ్య సముదాయం. నాలుగు రోజుల క్రితం ఇక్కడ నాలుగు దుకాణాల్లో దొంగలు పడ్డారు. రూ.లక్ష నగదు, వస్తువులు అపహరించారు. ఇక్కడ తరచూ దొంగతనాలు జరగడం కొసమెరుపు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది వారం క్రితం ధర్మవరం పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీనగర్ రహదారి పక్కన ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్ అపహరణకు గురైంది. సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. పోలీసుల గస్తీ ముమ్మరంగా ఉండే ఈ ప్రాంతంలో దొంగతనం జరగడం విస్మయం కల్గిస్తోంది.

- ధర్మవరంలో రెచ్చిపోతున్న దొంగలు
- వరుస చోరీలతో పోలీసులకు సవాల్
- ఏళ్లు గడుస్తున్నా కొలిక్కి రాని కేసులు
- వణికిపోతున్న శివారు ప్రాంతాల ప్రజలు

- రెండు నెలల క్రితం ధర్మవరంలోని జర్నలిస్ట్ కాలనీలో నివాసం ఉండే ఓ మహిళా కానిస్టేబుల్ ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో చోరీకి పాల్పడ్డారు. ఎనిమిది గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు.
- ధర్మవరం మండలం చిగిచెర్ల–కందుకూరు కాలువ సమీపంలో ప్రధాన రహదారి వద్ద రాత్రి 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఓ యువకుడిని అటకాయించిన దొంగలు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సదరు వాహనదారుడు ఎదురు తిరగడంతో ఆగ్రహించిన దుండగులు కత్తితో గాయపరిచి నగదు లాక్కున్నారు.

పైన తెలిపినవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ధర్మవరంలో తాళం వేసిన ఇళ్లు కనపడితే చాలు చోరీలకు పాల్పడుతున్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో సైతం ఎటువంటి జంకు లేకుండా చోరులు రెచ్చిపోతున్నారు. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు



దుకాణంలో చోరీ చేస్తున్న దొంగలు (సీసీ కెమెరా ఫుటేజీ)

ధర్మవరం: పట్టు చీరలకు ప్రసిద్ధిగాంచిన ధర్మవరంలో నిత్యం వందలాది మంది వ్యాపారులు ఇతర రాష్ట్రాలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చి లావాదేవీలు చేస్తుంటారు. అయితే ఇటీవల వరుస దొంగతనాలు పట్టణ ప్రజలతో పాటు వ్యాపారులను కలవరపెడుతున్నాయి. తరచూ దొంగతనాలు జరగడం.. ఇంట్లో ఉన్న వస్తువులను, డబ్బు, బంగారం వంటి వాటిని ఎత్తుకెళ్లడం పరిపాటిగా మారుతోంది.

తాళం వేసినవే టార్గెట్..

పట్టణంలో తాళం వేసిన ఇళ్లు, వ్యాపార సముదాయాలే లక్ష్యంగా దొంగలు చోరీలకు తెగబడుతున్నారు. ముందు రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు చోరీలకు పథక రచన చేస్తున్నారు. ఈమధ్య కాలంలో బెంగళూరు రోడ్డులో అనంతపురం వైపు ఉన్న ప్రధాన రహదారిలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక తారకరామాపురం వద్ద ఉన్న రహదారి వైపు అయితే రాత్రి వేళల్లో కొంత మంది యువకులు గుంపుగా చేరి వాహన చోదకులను అటకాయించి డబ్బులు వసూలు చేస్తున్నారు. దీంతో అటువైపు వెళ్లాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

ఈజీ మనీకోసమే...

వరుస దొంగతనాలకు కారణం ఈజీ మనీ కోసమే. ఆకతాయిలు దొంగలుగా మారుతున్న సందర్భాలు కొన్నైతే.. ఇతర రాష్ట్రాల నుంచి బిహార్, పూణే గ్యాంగ్‌ల పేరుతో మరికొందరు ధర్మవరంలో తిష్ట వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీరంతా ప్రొఫెషనల్ దొంగలు కావడంతో ఈజీగా చోరీలకు పాల్పడుతున్నారు. వీరిలో ఎక్కువ భాగం తలదాచుకునేందుకు శివారు ప్రాంత కాలనీలు అడ్డాగా మారాయి. పోలీసులు ఆయా ప్రాంతాల్లో నిఘా ఉంచితే దొంగల ఆచూకీ తెలియడం సులభమౌతుంది.

గస్తీ ముమ్మరం చేయాలి..

ధర్మవరం పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ప్రతి నెలా పదుల సంఖ్యలో దొంగతనాలు జరుగుతున్నాయి. వీటిలో కొంతమంది పోలీసులకు ఫిర్యాదు చేస్తే మరికొంత మంది ఫిర్యాదు చేయకుండా మిన్నకుండిపోతున్నారు. దొంగతనాలు అటకట్టించాలంటే పట్టణంలో రాత్రివేళ పోలీసు గస్తీ ముమ్మరం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ప్రియాంకనగర్‌లో ఏడాది క్రితం బీరువా పగులగొట్టి బంగారం అపహరించిన దృశ్యం

ఏడాది దాటినా రికవరీ లేదు



మేము 2023 నవంబర్‌లో శుభకార్యం నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లాం. తిరిగి వచ్చి చూసే సరికి చోరీ జరిగింది. బీరువా పగులగొట్టి 9 తులాల బంగారం అపహరించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాము. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయినప్పటికీ ఇంత వరకు దొంగల ఆచూకీ కనుగొనలేదు. సొమ్ము రికవరీ కాలేదు. దయ ఉంచి పోలీసులు మాకు న్యాయం చేయాలి.

– మహేష్, ప్రియాంకనగర్, ధర్మవరం

దొంగల జాడే దొరకలేదు



మా నాన్న ఆరోగ్యం బాగోలేక చనిపోతే అంత్యక్రియల కోసం ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లాం. ఆ సమయంలో ఇంట్లోకి దొంగలు ప్రవేశించి 8 తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. సంవత్సరాలు దాటినా దొంగల జాడ దొరకలేదు. పోలీసులు స్పందించి చోరీ సొత్తు రికవరీ చేయాలి.

– నంద, పీఆర్‌టీ స్ట్రీట్, ధర్మవరం

ప్రత్యేక చర్యలు



ధర్మవరం పోలీస్ సబ్‌డివిజన్‌లో దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతూ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. దొంగతనాల సంఖ్యను గతంతో పోలిస్తే చాలావరకు అరికట్టాం. నిరంతర గస్తీ నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రజలు కూడా తాళం వేసి వెళ్లేటప్పుడు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇస్తే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా నిఘా ఉంచుతారు.

– శ్రీనివాసులు, డీఎస్పీ, ధర్మవరం

సెమీ క్రిస్మస్ వేడుకలు

పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ చేతన్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. తొలుత కేక్ కట్ చేసి క్రైస్తవులకు, చిన్నారులకు పంచి పెట్టారు. క్యాండిల్ వెలిగించి క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పారు. పలువురు చిన్నారులు శాంటాక్లాజ్ వేషధారణలతో అలరించారు. అనంతరం పాస్టర్లు క్రిస్మస్ పండుగ గురించి తెలియజేశారు. ప్రార్థనలు, గీతాలు ఆలపించారు. అధికారులకు ఆశీర్వచనాలు అందించారు. రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు స్వామిదాస్, పాస్టర్లు రాజారత్నం, డేనియల్, డేవిడ్, ఫిలిప్, సర్వేశ్వరరావు, మైకేల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డులో 'నారాయణ' పైత్యంపై మండిపాటు

పరిగి: ఇంటర్మీడియెట్ బోర్డులో నారాయణ కళాశాలల ప్రిన్సిపాళ్లను నామినేటెడ్ సభ్యులుగా నియమిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడంపై ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) మండిపడింది. ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ శనివారం పరిగిలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తూ విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తోందని విమర్శించారు. విద్యను వ్యాపారంగా చూసే విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లను బోర్డు సభ్యులుగా చేర్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

వాగులో తిరగబడిన ఎడ్లబండి

- కాడెద్దులు మృత్యువాత



రైతును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి: వాగు గుంతలో ఎడ్లబండి తిరగబడింది. ఎద్దుల గొంతుకు పట్టీ బిగుసుకోవడంతో మృత్యువాతపడ్డాయి. వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం కొత్తకోటలో రైతు పక్కీరప్ప కూలీలతో కలిసి శనివారం ఎడ్లబండిపై పొలానికి బయల్దేరాడు. గ్రామ సమీపాన వాగులో వెళ్తున్నప్పుడు లోతైన గుంతను గమనించకపోవడంతో బండి పల్టీ కొట్టింది. బండిపై కూర్చున్న కూలీలను రక్షించే క్రమంలో కాడి మానుకున్న పట్టీలు ఎద్దుల గొంతుకు బిగుసుకొని నీటిలో ఊపిరి ఆడక మృతి చెందాయి. దీంతో రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. బాధిత రైతును వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కేశప్ప, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, కిష్టయ్య, రఘు తదితరులు పరామర్శించి, రూ.20 వేల ఆర్థికసాయం అందించారు.

జగన్ ఫ్లెక్సీకి నిప్పు

- రామగిరి మండలం ఎంసీపల్లిలో ఘటన



ఎంసీపల్లిలో మాజీ సీఎం ఫ్లెక్సీని తొలగించిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. రోజూ ఏదో ఒక గ్రామంలో అలజడి సృష్టిస్తున్నారు. ఈ క్రమంలోనే శనివారం మాజీ సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి నిప్పు పెట్టారు. జగన్ జన్మదినం సందర్భంగా గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేశారు. ఈ క్రమంలో అక్కడ జగన్ ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వారు కార్యక్రమాన్ని ముగించుకుని వెళ్లగానే ఓర్వలేని టీడీపీ నాయకులు హరిజన మారెప్ప, బొడ్డు నరసింహప్ప, కంసల నారాయణ, దుబ్బు సిద్ధన్న, అశ్వర్థ ఆ ఫ్లెక్సీని తొలగించి నిప్పుపెట్టినట్లు గ్రామస్తులు తెలిపారు.

వీరభద్రుని సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి దంపతులు



ఆలయంలో హైకోర్టు జడ్జి దంపతులు

లేపాక్షి: ప్రముఖ పుణ్యక్షేత్రం లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయాన్ని మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ అచల్‌కుమార్‌పలివాల్ దంపతులు శనివారం రాత్రి సందర్శించారు. దుర్గాదేవి, వీరభద్రస్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టతను తెలుసుకునారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ అధికారులు జడ్జి దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం జడ్జి దంపతులు నంది విగ్రహాన్ని తిలకించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మందుల దుకాణాలపై దాడులు

హిందూపురం టౌన్: పట్టణంలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్న మందుల దుకాణాలపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న, డీఎస్పీ మహేష్, సీఐలు శనివారం దాడులు నిర్వహించారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా ప్రాస్మో ప్రాక్స్ మందులు ఇస్తుండడంతో వాటిని సీజ్ చేశారు. శంకర్ మెడికల్ స్టోర్ యాజమానిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సీఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ టీవీ టవర్ ఎదురుగా INDIAN OIL PUMP సమీపంలో 5 సెంట్ల పడమర PLOT అమ్మబడును. సంప్ర. 7730883954. [SCA24000879]

■ ATP, KLD రోడ్డు, రాచానపల్లి పొలం 144 సర్వే నెంబరు నందు 4 సెంటు & ATP, బళ్లారి రోడ్డు, A.P. Lightings ఎదురుగా 3 సెంట్లు ఇల్లు కట్టుకొను స్థలం అమ్మబడును. 6281267589. [A-948]

■ ATP-బళ్లారి రోడ్‌కు, మణిపాల్ ఇంటర్నేషనల్ స్కూల్ కి దగ్గరలో, సత్యగార్డెన్స్ వెంచర్ నందు, మెయిన్ రోడ్ కి 6 వ బిట్, ఉత్తరం ఫేస్ గల 3.78 సెంట్స్ ప్లాట్ అమ్మకానికి కలదు. సెల్: 9052104796, 8978071359. [A-1447]

HOUSE FOR SALE

■ అనంతపురం జిల్లా, పెద్దవడుగూరు మండలంలోని కోటలో 100% వాస్తుతో నిర్మించిన, ఉత్తరం, దక్షిణం కార్నర్ ఇల్లు 3 సెంట్లలో నిర్మించినది 18 లక్షలకు అమ్మబడును. ఫోన్: 90529 59380. [L-794871]

SERVICES

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 96430 10487, 8376089771, 011-25920179 [DA-6124]

WANTED

■ S.V. చికెన్ సెంటర్ (అనంతపురం) నందు పనిచేయుటకు (10th / Inter చదివిన) వర్కర్ కావలెను. సెల్ : 80744 29294, 95420 93517. [A-594]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (విజయవాడ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 15-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 95420 47788, 92814 52843 [B-1172526]

■ మా కంపెనీ కొరకు కంప్యూటర్ ఆపరేటర్ (పురుషులు) కావలెను, జీతం: 8k to 9k. Q: కంప్యూటర్ నాలెడ్జ్ ఏజ్ : 40 సం:లోపు, అడ్రస్: కమలానగర్, అనంతపురం. 9493181828. [A-1441]

■ సోలార్ కంపెనీ నందు పనిచేయుటకు టెక్నీషియన్లు & హెల్పర్లు కావలెను. జీతం: 8 వేలు నుండి 10 వేలు. @ అనంతపురం. సెల్: 8121766831. [A-1446]

■ పామిడి పట్టణం నందు 1 నుండి 6వ తరగతి వరకు ఇంగ్లీష్, మాథ్స్, బోధించుటకు టీచర్స్ కావలెను (హాస్టల్ వసతి కలదు). 8790612613, 9573736655. [SCA24000876]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30 సం.లోపు జీ: 18- 25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 91771 77244. [B-1172677]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256011]

■ Looking for 1-4yrs Sales and Marketing experience profiles in Paints Industry. Working across AP & TS. VG Paintings Industry. Contact: 9494998833. [L-1259408]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [HA-1390]

■ పనివారు కావలెను HYD, బెంగుళూరు లో ఉండి ఇంటి, వంటపని, వృద్ధుల సేవ, పిల్లలపోషణకి స్త్రీలు కావలెను. ఫోన్: 9391912949/ 04040123376 [SCA24000716]

■ URGENTLY REQUIRED QUALIFIED & EXPERIENCED SALES OFFICER TO PROMOTE SOLAR ENERGY PRODUCT FOR A REPUTED BRAND. PLEASE CALL 9052998786, 7981121926. [C-800142]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91332 71122, 95534 61177 [B-1172531]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ: 270/-
అదనపు లైను రూ: 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307 9010588846, 9243295650
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నోటీసు ఇచ్చాకే ఓటు తొలగించాలి

- ఓటరు జాబితా మార్పు, చేర్పుల్లో నిబంధనలన్నీ పాటించాలి
- బీఎల్‌ఓలను ఆదేశించిన ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ కన్నబాబు



బత్తలపల్లిలో ఓటరు నమోదు ప్రక్రియను తెలుసుకుంటున్న అబ్జర్వర్ కన్నబాబు

బత్తలపల్లి: ఏదైనా కారణం చేత జాబితా నుంచి ఓటరును తొలగించాలనుకుంటే ముందుగానే నోటీసు ఇవ్వాలని ఎలక్ట్రోరల్ అబ్జర్వర్, సాంఘిక సంక్షేమశాఖ సెక్రటరీ కె.కన్నబాబు బీఎల్‌ఓలను ఆదేశించారు. శనివారం ఆయన బత్తలపల్లిలో పర్యటించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాల్లో విధుల్లో ఉన్న బీఎల్‌ఓలతో మాట్లాడారు. ఫారం 6, 7, 8 నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, పేర్ల తొలగింపులో ఎన్నికల కమిషన్ నిబంధనలన్నీ పాటించాలన్నారు. బీఎల్‌ఓలు ఇప్పటి వరకు చేపట్టిన మార్పులు, చేర్పులు, క్లెయిమ్‌ల నమోదును పరిశీలించారు. ఆయన వెంట ధర్మవరం ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ స్వర్ణలత, డిప్యూటీ తహసీల్దార్ షణ్ముఖకుమార్ యాదవ్, బీఎల్‌ఓలు రాణాప్రతాప్, నరసింహులు, పవన్‌కుమార్‌రెడ్డి, ముత్యాలప్ప ఉన్నారు.

సమగ్రశిక్ష ఏపీసీగా డాక్టర్ దేవరాజ్



డాక్టర్ పి.దేవరాజ్

అనంతపురం: ఎస్కేయూలోని కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.దేవరాజ్ శ్రీసత్యసాయి జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ (అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్)గా నియమితులయ్యారు. గతంలో ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ దశరథ రామయ్య ఉమ్మడి జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేసిన విషయం విదితమే. తాజాగా మరో అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఈ అవకాశం దక్కింది. ఈ సందర్భంగా పలువురు దేవరాజ్‌కు అభినందనలు తెలిపారు.

31లోగా పరీక్ష రుసుం చెల్లించాలి

పుట్టపర్తి: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల రుసుమును అపరాధ రుసుం లేకుండా ఈ నెల 31లోగా చెల్లించాలని విద్యాశాఖ పేర్కొంది. జనవరి 4వ తేదీ లోపు సబ్జెక్టుకు రూ.25, 8వ తేదీలోపు రూ.50 చొప్పున అపరాధ రుసుంతో చెల్లించవచ్చని తెలిపింది. తర్వాత పదో తేదీలోపు తత్కాల్ రుసుంతో చెల్లించవచ్చని చెప్పింది. మరింత సమాచారం కోసం పాఠశాలలు, కళాశాలల్లో సంప్రదించాలని సూచించింది.

మద్యానికి డబ్బివ్వలేదని బలవన్మరణం



మృతుడు గిరీష్

గుడిబండ: మద్యానికి డబ్బు ఇవ్వలేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఏఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీటీ పల్లికి చెందిన గిరీష్ (31) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతుండేవాడు. మద్యం కోసం భార్య రమ్యతో రోజూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో డబ్బు ఇవ్వలేదని శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుని గిరీష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి పద్మక్క ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టాలెంట్ టెస్ట్‌కు ఏర్పాట్లు పూర్తి

పుట్టపర్తి టౌన్: జిల్లాలో కొత్తచెరువు ప్రధాన కేంద్రంగా వధాన్య సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించనున్న టాలెంట్ టెస్ట్ –2024కు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు వధాన్య సొసైటీ చైర్మన్ అశోక్ పడపాటి తెలిపారు. కొత్తచెరువులో ఏడు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు అన్ని జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన మూడు వేల మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని మండల కేంద్రాల నుంచి ఉచితంగా బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

వంద శాతం లక్ష్య సాధనపై దృష్టి

- మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ ఆదేశం



ఏడీఎంలు, సెక్రటరీలతో సమీక్షిస్తున్న మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ సి.రామాంజనేయులు

అనంతపురం అగ్రికల్చర్: ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు లక్ష్యాలు సాధించడంపై మార్కెట్ కమిటీలు దృష్టి సారించాలని మార్కెటింగ్‌శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజనేయులు ఆదేశించారు. శనివారం నగరంలోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో రెండు జిల్లాల ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎస్ మూర్తితో కలిసి 17 మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లా పరిధిలో ఉన్న 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా ఈ ఏడాది రూ.12.06 కోట్లు లక్ష్యం కాగా.. ఎనిమిది నెలలకు గానూ 55 శాతం రూ.6.70 కోట్లు వసూలైందన్నారు. గతేడాది కన్నా ఈసారి రూ.26 లక్షల వరకు ఆదాయం తగ్గిందన్నారు. అనంతపురం, శింగనమల, తాడిపత్రి కమిటీల పరిస్థితి బాగానే ఉన్నా మిగతా వాటిల్లో పురోగతి లేదన్నారు. గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ కమిటీల్లో ఆదాయం పెంచాలని ఆదేశించారు.

- అలాగే శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న 8 మార్కెట్ కమిటీలు, 16 చెక్‌పోస్టుల ద్వారా ఈ ఏడాది రూ.5.31 కోట్లు టార్గెట్ కాగా ఇప్పటి వరకు 61 శాతంతో రూ.3.24 కోట్లు వసూలు చేశారని మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ తెలిపారు. మార్కెట్‌యార్డుల్లో రైతులకు అందిస్తున్న సేవలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు.

ప్రేమ, శాంతి వెల్లివిరియాలి

- ప్రశాంతినిలయంలో క్రిస్మస్ వేడుకలు ప్రారంభం



క్రిస్మస్ వేడుకలను ప్రారంభిస్తున్న రత్నాకర్ దంపతులు

పుట్టపర్తి అర్బన్: ప్రజల్లో ప్రేమ, శాంతి వెల్లి విరియాలని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. సత్యసాయి మహా సమాధి చెంత సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ శనివారం క్రిస్మస్ క్యాండిల్‌ను వెలిగించి వేడుకలు ప్రారంభించారు. ఐదు రోజులపాటు సాగే వేడుకలకు దేశ విదేశాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి క్రీస్తు బోధనలు, సత్యసాయి బోధనల సారాన్ని భక్తులకు వివరించారు. ప్రేమ, శాంతి కోసం క్రీస్తు, సత్యసాయి ఏ విధంగా బోధనలు చేశారో ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై ప్రసారం చేశారు. ప్రముఖ సంగీత కళాకారిణి అనులవ్ సంగీత కచేరీ, సాయంత్రం భజనలు, మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు.

శోభయమానం..

క్రిస్మస్ వేడుకల సందర్భంగా ప్రశాంతి నిలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. భవనాలు, ప్రహరీలతో పాటు పార్కులు, క్యాంటీన్లు, స్టోర్, రేడియో సాయి, పరిపాలనా భవంతి తదితర చోట్ల క్రిస్మస్ ట్రీ, శాంటా క్లాజ్, ఏసు జన్మించిన బోధ కొట్టం, తదితర ఆకృతులతో విద్యుత్ దీపాలను అలంకరించారు.

సమష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి



ప్రసంగిస్తున్న ఎంపీ పార్థసారథి, చిత్రంలో మంత్రి సవిత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: సమష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని దిశ చైర్మన్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మొదటి సారి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ చేతన్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, కమిటీ సభ్యులు ఏవీ రమణారెడ్డి, చక్రవర్ధన్‌రెడ్డి, శివశంకర్, మీనాక్షి, నరసింహులు, సువర్ణ, భారతి, నరసింహమూర్తి, రామాంజనేయులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దిశ చైర్మన్ మాట్లాడుతూ కరువు నుంచి ప్రజలు విముక్తి పొందాలంటే అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ నష్టపోయిన కంది పంటకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందా అని అధికారులను అడిగారు. హిందూపురంలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు కవిత, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయ్‌ప్రసాద్, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, డీపీఓ సమత, పీఆర్ ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.